క్లుప్తంగా

రోడ్డు నిర్మించాలని వినతి



ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేస్తున్న వామాసీ, దేరుగండ గ్రామస్తులు

గుమ్మలక్ష్మీపురం: రోడ్డు నిర్మించాలని కోరుతూ కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి మండలంలోని వామాసీ, దేరుగండ గ్రామస్తులు సోమవారం వినతిపత్రం అందజేశారు. తమ గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నట్లు ఎమ్మెల్యే వద్ద వాపోయారు. ఎగువ తాడికొండ నుంచి దేరుగండ వరకు 6 కిలోమీటర్లు, చాపరాయి జంగిడిభద్ర జంక్షన్ నుంచి వామాసి వరకు 2.5 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కామేశ్వరరావు, జమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

శిథిల బావి పూడ్చివేత



జేసీబీతో మట్టిని పోస్తున్న దృశ్యం

గరుగుబిల్లి: మండలంలోని పెద్దూరు గ్రామంలోని ఎస్సీ వీధిలో శిథిలమైన నేలబావిని పూడ్చివేయాలని కోరుతూ ఈ నెల 14న సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించారు. జేసీబీ సాయంతో బావిచుట్టూ పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. గ్రావెల్‌తో బావిని పూడ్చివేశారు. సర్పంచ్ ఎం.నారాయణమ్మ, వైస్ సర్పంచ్ టి.ఎల్లంనాయుడు, సచివాలయ కార్యదర్శి సుభద్రమ్మ పనులను పర్యవేక్షించారు.

మెరుగైన సేవలందించాలి..

- 108 జిల్లా మేనేజర్ మన్మథనాయుడు



శిక్షణలో పాల్గొన్న ఈఎంటీలతో 108 జిల్లా యంత్రాంగం

పాలకొండ రూరల్: నేటి సమాజ పరిస్థితులకు అనుగుణంగా మరింత మెరుగైన సేవలు 108 ద్వారా ప్రజలకు అందించాలని ఏఈఎంఎస్ సంస్థ 108 జిల్లా మేనేజర్ ఎస్.మన్మథనాయుడు అన్నారు. పాలకొండ ఏరియా ఆస్పత్రిలో 108 ఈఎంటీలకు అందిస్తున్న శిక్షణ కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాహనాల తాజా స్థితిగతులు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు– వాటి పరిష్కారానికి సంస్థ పరంగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. శిక్షణలో భాగంగా బేసిక్ ఎయిర్ మేనేజ్‌మెంట్, ట్రామా అత్యవసర విభాగం, వాహనంలో ఉన్న పరికరాలు, ఔషధాల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఓఈలు గిరిబాబు, విజయ్‌కుమార్, ఓజీటీ ఆలుబిల్లి శ్రీనివాసరావుతో పాటు డివిజన్ పరిధిలోగల 56 మంది ఈఎంటీలు పాల్గొన్నారు.

గంజాయి నివారణకు సహకరించండి

సాలూరు: గంజాయి నివారణకు పోలీసులకు సహకరించాలని సీఐ అప్పలనాయుడు కోరారు. పట్టణంలో లారీ ఓనర్స్ అసోసియేషన్ వద్ద సోమవారం లారీ యజమానులు, కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రోడ్ల మీద అస్తవ్యస్తంగా లారీలను పార్క్ చేయవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని కోరారు. నిబంధనలు అతిక్రమించేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మరణాలపై సమగ్ర విచారణ చేయాలి

పార్వతీపురంటౌన్: మన్యం జిల్లాలో ఇటీవల అనారోగ్యంతో తల్లీకూతుర్లు మృతి చెందిన సంఘటనపై సమగ్ర విచారణ జరపాలని, ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఆర్‌వీఎస్ కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. జియ్యమ్మవలస మండలం బట్లభద్ర గ్రామంలో 24 గంటల వ్యవధిలో తల్లి, కూతురు మృతి చెందిన సంఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన వైద్య అందకపోవడంతో రోగులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారని, కానీ అక్కడ వైద్యం పేరుతో రోగులను నిలువునా దోచేస్తున్నారని ఆరోపించారు. ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల వైద్య ఆరోగ్య శాఖ మంత్రి జిల్లా పర్యటనలో మన్యం ప్రజలకు అందుతున్న వైద్య సేవల విషయంలో వాస్తవాలు బయటకు రాలేదన్నారు. సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బాధితులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామన్నారు.



ఆలోచనా విధానంలో మార్పు అవసరం

ఆపద కాలంలో ప్రజల ప్రాణాలు కాపాడే వైద్యుల పట్ల గౌరవ భావన అవసరం. క్షణికావేశంలో దాడులు, దుర్భాషలాడడం, వేధింపులకు పాల్పడడం, ప్రాణాలు తీయడం హేయమైన చర్యలు. ముందుగా మన ఆలోచనా విధానంలో మార్పు అవసరం. మీ పిల్లలే వైద్యులుగా, వైద్యరంగంలో విధులు నిర్వహిస్తే ఎలాంటి రక్షణ కోరుకుంటారో ఆలోచించాలి. వైద్యుల రక్షణకు ప్రభుత్వాలు సరైన చట్టాలు అమలు చేయాలి. హద్దు మీరితే చట్టం పనితీరు కఠినంగా ఉంటేనే సమాజంలో మార్పు వస్తుంది. దీనిపై క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలి.

– డాక్టర్ కొడాలి వెన్నెల, అన్నవరం పీహెచ్‌సీ, పాలకొండ మండలం



ప్రత్యేక విశ్రాంతి గదులు అవసరం..



నిత్యం వందలాది మంది రోగులకు సేవలందించడంతో తీవ్ర ఒత్తిడి ఉంటుంది. మా కష్టం కూడా రోగులు, వారి బంధువులు గుర్తించాలి. మాకు అవసరమైన భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు ప్రజలపై కూడా ఉంది. పాలకొండ ఆస్పత్రిలో నర్సింగ్ స్టాఫ్‌కు సంబంధించి విశ్రాంతి గది గ్రౌండ్ ఫ్లోర్‌లో మాత్రమే ఉంది. రాత్రి సమయంలో విశ్రాంతి తీసుకోవాలంటే పైనుంచి కిందకు దిగి రావాల్సి ఉంది. ఆ సమయంలో సిబ్బంది భయపడుతున్నారు. ఆస్పత్రుల్లో రక్షణ చర్యలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలి.

– యండమూరి రాధ, హెడ్‌నర్స్, ఏరియా ఆస్పత్రి, పాలకొండ

నేడు 'పొలం పిలుస్తోంది'

సీతంపేట: మండలంలో మంగళవారం నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి శ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు రెండు రైతు సేవా కేంద్రాల పరిధిలో పర్యటించి రైతులకు సూచనలు, సలహాలు ఇస్తారని పేర్కొన్నారు.

శ్రీకృష్ణుడు సర్వ మానవాళికి ఆదర్శప్రాయుడు..



పాలకొండ: రాధాకృష్ణ వేషధారణలో చిన్నారులు




పాలకొండ: నాగవంశపు వీధిలో కృష్ణాష్టమి వేడుకల్లో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

చేసిన కర్మలకు ప్రతిఫలం అనుభవించక తప్పదని.. ప్రతి ఒక్కరూ తమ అంతరాత్మ ప్రకారం నడుచుకోవాలని లోకానికి చాటిచెప్పిన శ్రీకృష్ణ మహాప్రభువు సర్వ మానవాళికి ఆదర్శప్రాయుడు. అటువంటి దేవదేవుడి జన్మాష్టమిని వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. సోమవారం వేకువ జామునుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. యువత సాయంత్రం వేళ ఉట్టికొట్టే సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను రాధాకృష్ణులుగా అలంకరించి.. ఆ దేవుడే తమ ఇంట సందడి చేస్తున్నాడని సంబరపడిపోయారు.

- పాలకొండ / కురుపాం నెట్‌వర్క్



వీరఘట్టం: గోపిక వేషధారణలో ఓ బాలిక



గరుగుబిల్లి: పిట్టలమెట్ట గ్రామానికి చెందిన పి.సోమేష్ కృష్ణాష్టమి సందర్భంగా శ్రీకృష్ణుడు గోవులను కాస్తున్నట్టు వేసిన వర్ణచిత్రం.



పాలకొండ రూరల్: రాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు చేపడుతున్న అర్చకులు



గుమ్మలక్ష్మీపురం: ఆర్టీసీ కాంప్లెక్స్ కాలనీలో ఉట్టి కొడుతున్న చిన్నారులు



వీరఘట్టం : బార్నాలవీధిలో ఉట్టి కొట్టేందుకు సిద్ధమవుతున్న చిన్నారులు, యువత



భామిని: రాధాకృష్ణుల అలంకరణలో చిన్నారులు

27 నుంచి సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్షలు

గరుగుబిల్లి: పాఠశాల స్థాయిలో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు అంచనా వేసేందుకు నిర్వహించే సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్షలు ఈనెల 27 నుంచి సెప్టెంబర్ 2 వరకు నిర్వహించనున్నట్లు ఎంఈఓ ఎన్.నాగభూషణరావు తెలిపారు. గతంలో ఫార్మెటివ్ అసెస్మెంట్(ఎఫ్ఏ)గా ఉన్న పరీక్షలను సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్షలుగా విద్యాశాఖ మార్పు చేసిందన్నారు. రోజుకొకటి చొప్పున ఆరు రోజుల పాటు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని పాఠశాలలకు జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ నుంచి ప్రశ్నపత్రాలను సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ప్రాథమిక తరగతులకు ఉదయం 10.45 నుంచి 11.45 వరకు, 6,7,8 తరగతులకు మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 2.30 గంటల వరకు, 9,10 తరగతులకు ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేసినట్లు చెప్పారు.

విద్యార్థుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం

- గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర



రికార్డులు పరిశీలిస్తున్న డీడీ అన్నదొర

పాలకొండ రూరల్: వివిధ ప్రాంతాల నుంచి ఉన్నత చదువుల కోసం వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థులకు సరైన సౌకర్యాలు కల్పించాలని గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర స్పష్టం చేశారు. పట్టణంలోని పోస్టుమెట్రిక్ బాలికల వసతిగృహాన్ని సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీరు, మెనూ, వంటశాల, స్టాక్ రూమ్‌తో పాటు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుత సీజన్‌లో విద్యార్థినుల ఆరోగ్య భద్రతకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని వసతిగృహ సంక్షేమాధికారి రామలక్ష్మికి సూచించారు.

ప్రజలతో కలిసి ఉద్యమిస్తాం..



శివారు ప్రాంత మహిళల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న రమణరావు

పాలకొండ రూరల్: పట్టణంలో పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టకపోతే ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని పట్టణ పౌరసంఘ నాయకుడు దావాల రమణరావు అన్నారు. పట్టణ శివారు ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించి, ప్రజా సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలకులు, అధికారులు స్పందించి చర్యలు చేపట్టకుంటే నగర కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తామన్నారు. డంపింగ్ యార్డు సమస్యపై చర్యలకు ఉపక్రమించకపోవడంతో చెత్త పేరుకుపోయి, దోమలు అధికమై ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని ఆరోపించారు. వెంటనే అధికారులు, పాలకులు స్పందించి పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలని డిమాండ్ చేశారు.

సృజనాత్మకతను వెలికితీయాలి



జీవిత లక్ష్యాలను చిత్ర రూపంలో వేసి వివరిస్తున్న బాలికల బృందం

భామిని: బాలికలు తమ లక్ష్యాలను చేరుకోవాలంటే వారిలో అంతర్లీనంగా ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని హోలీక్రాస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కరణం ప్రభుదాస్ అన్నారు. మండలంలోని సింగిడి కల్యాణ మంటపంలో హోలీక్రాస్ అనుబంధమైన 10 గ్లో - క్లబ్ సభ్యులైన బాలికలకు జీవిత లక్ష్యాలపై సోమవారం శిఖరాగ్ర చర్చావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీవిత లక్ష్యాలను చేరుకోవడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన సోషల్ స్టడీస్ విద్యార్థిని బి.మన్విత ముఖ్య అతిథిగా పాల్గొని గ్రామీణ బాలికల ఆశాభావాలను గుర్తించారు. గ్లో - క్లబ్ సభ్యులు నేర్చుకొంటున్న అంశాలను వేదికపై వివరించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- ఎస్సై ప్రయోగమూర్తి



మాట్లాడుతున్న ఎస్సై ప్రయోగమూర్తి

పాలకొండ : శాంతిభద్రతలకు ఎవ్వరు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తప్పవని ఎస్సై ప్రయోగమూర్తి స్పష్టం చేశారు. పాలకొండ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ, మండలంలో ప్రశాంత వాతావరణం కల్పించడమే తన లక్ష్యమని తెలిపారు. మాదక ద్రవ్యాల రవాణాపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు చెప్పారు. అలాగే ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించేవారు పోలీసుల అనుమతి తప్పకుండా తీసుకోవాలన్నారు.


హెల్మెట్ తప్పనిసరి



వాహనాలను తనిఖీలు చేస్తున్న ఎస్సై రమేష్‌నాయుడు

గరుగుబిల్లి: ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్‌ను విధిగా ధరించాలని ఎస్సై పి.రమేష్‌నాయుడు అన్నారు. మండలంలోని ఐటీడీఏ పార్క్ సమీపంలో ప్రధాన రహదారిపై సోమవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు జరిగినపుడు హెల్మెట్ ధరించకపోవడంతో తలకు బలమైన గాయాలై ఎంతో మంది మరణిస్తున్నారన్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని కోరారు. రహదారి భద్రత నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

సవర భాష వలంటీర్లను కొనసాగించాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): సవర భాషా వలంటీర్లను కొనసాగించాలని, లేదంటే వారితో కలిసి ఆందోళన చేస్తామని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు టి.రమేష్ అన్నారు. కురుపాం మండలం కొండలేవిడి రబ్బరు తోటలో సోమవారం జిల్లాలో పనిచేసిన సవర భాషా వలంటీర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భవిష్యత్ కార్యాచరణపై వారంతా చర్చించుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ.. సవర భాషా వలంటీర్లందరికీ రెన్యువల్స్ ఆర్డర్స్ ఇవ్వాలని, బకాయి ఉన్న 3 నెలల జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే వారితో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

తరగతులు అడ్డుకున్న ఏఐఎస్ఎఫ్

పార్వతీపురంటౌన్: సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తున్న పలు విద్యాసంస్థలను ఏఐఎస్ఎఫ్ నాయకులు సోమవారం మూసివేయించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహించొద్దని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్ ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలను కోరారు. విద్యార్థుల మానసిక ఆనందాన్ని దూరం చేయద్దన్నారు.

క్రీడాకారులకు అభినందన

సీతానగరం: ఇటీవల జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. వారిని పీడీ ఎం.శ్రీనివాసరావుతో పాటు పలువురు నాయకులు సోమవారం అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించడం ద్వారా ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయన్నారు.

ప్రభుత్వ వైద్యం అందకే ఏజెన్సీలో మరణాలు



బొడ్లగూడలో జ్వర బాధితులను పరామర్శిస్తున్న సీపీఎం నాయకులు

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ వైద్యం సక్రమంగా అందకపోవడం వల్లే ప్రజలు ప్రైవేటు వైద్యులను ఆశ్రయించాల్సి వస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ఆరోపించారు. మండలంలోని బొడ్లగూడ, దొరజమ్ము గ్రామాల్లో మలేరియా, టైఫాయిడ్ తదితర జ్వరాలతో బాధపడుతున్న రోగులను పార్టీ జిల్లా నాయకులు కోలక అవినాష్, మండంగి శ్రీనివాస్, వెంకటరావుతో కలిసి సోమవారం పరామర్శించారు. బాధితులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి, వైద్య సేవలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గిరిజన గ్రామాల్లో మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాలతో ఎంతో మంది చనిపోతున్నారని, ఇవి బయట ప్రపంచానికి తెలియడం లేదని అన్నారు. అవన్నీ ప్రభుత్వ హత్యలేనని ఆరోపించారు. ఇప్పటికైనా అన్ని గ్రామాల్లో యుద్ధప్రాతిపాదికన వైద్య శిబిరాలు నిర్వహించాలని, పారిశుద్ధ్యం మెరగుపర్చాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందిస్తున్న వైద్య సేవలపై, జరుగుతున్న మరణాలపై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని, ఆస్పత్రుల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. పార్వతీపురంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తిచేయాలని, కురుపాం సీహెచ్‌సీని సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రిగా మార్చాలని, గుమ్మలక్ష్మీపురం సీహెచ్‌సీని ఏరియా ఆస్పత్రిగా మర్చాలని, ఆస్పత్రుల్లో రక్త నిల్వలతో పాటు ప్లేట్‌లెట్స్‌ను కూడా అందుబాటులో ఉంచాలని కోరారు.

వంతెనపై గోతులు పూడ్చండి



వంతెనపై ఏర్పడిన గొయ్యిని చూపిస్తున్న సీపీఎం నాయకుడు సాంబమూర్తి

కొమరాడ: పార్వతీపురం నుంచి కూనేరు వెళ్లే అంతఃరాష్ట్ర రహదారిపై కోటిపాం జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలో జంఝావతి నదిపై ఉన్న వంతెనపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడటంతో వాహన చోదకులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి వంతెనపై ఏర్పడిన గోతులు పూడ్చాలని సీపీఎం నాయకుడు కొల్లు సాంబమూర్తి సోమవారం డిమాండ్ చేశారు. బ్రిటిష్ కాలంలో నిర్మించిన ఈ వంతెన కూలిపోతే మూడు రాష్ట్రాలకు వెళ్లే రహదారి మూత పడుతుందన్నారు. ఏదైనా ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించాలని కోరారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



యువతకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న మాజీ నేవీ ఉద్యోగులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): మండలంలోని దురిబిల్లి గ్రామంలో పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న 53 మంది గిరిజన విద్యార్థులకు విశాఖపట్టణంకు చెందిన మాజీ నేవీ ఉద్యోగులు షేక్ సిరాజుద్దీన్, వి.బి.ఎస్ ప్రతాప్, నగేష్, గంగాధర్ సోమవారం స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. బీఈడీ, డీఈడీ, డిగ్రీ, ఇంటర్, డిప్లొమో ఆపై చదువులు చదువుకుని ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్న నిరుద్యోగ యువతకు ఎస్ సొసైటీ ద్వారా స్టడీ మెటీరియల్‌ను సమకూర్చినట్లు చెప్పారు. మాజీ నేవీ ఉద్యోగుల వాట్సాప్ గ్రూప్ ద్వారా నిధులు సేకరించి వివిధ పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు కొనుగోలు చేసి నిరుద్యోగ యువతకు అందజేస్తున్నట్లు సిరాజుద్దీన్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌష్, సర్పంచ్ పువ్వల అజ్జరి, మాజీ సర్పంచ్ పువ్వల పత్తి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మాజీ మంత్రి శత్రుచర్లను కలిసిన తోట

భామిని: మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజును వైఎస్సార్‌సీపీ భామిని మండల అధ్యక్షుడు తోట సింహచలం సోమవారం స్థానిక మేరింగి కోటలో కలిసి పరామర్శించారు. కొంత కాలంగా అనారోగ్యంతో కోటకే పరిమితమైన మాజీ మంత్రి శత్రుచర్లను కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పరామర్శలో పార్టీ నాయకుడు గేదెల మోహన్ ఉన్నారు.

సీతంపేటలోనే ఐటీడీఏ

- ఎమ్మెల్యే జయకృష్ణ



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న గిరిజన సంఘాల నాయకులు

సీతంపేట: ఐటీడీఏ కార్యాలయం తరలింపుపై ఎటువంటి సమాచారం లేదని, అయినప్పటికీ సీతంపేటలోనే ఐటీడీఏ ఉండేటట్లు చూస్తానని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక సామాజిక భవనంలో గిరిజన సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన సమస్యలపై రాజీపడే ప్రసక్తే లేదన్నారు. ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో డోలీ మోతలు ఉన్నాయన్నారు. ఆయా గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తానని, ఫీడర్ అంబులెన్స్‌లను పునరుద్ధరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ వలంటీర్లు, కుక్, కమాటీ వంటి పోస్టులు భర్తీ చేసేందుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో మాట్లాడతానన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.తోటముఖలింగం, హెచ్.ప్రసాద్, బి.తేజేశ్వరరావు, కె.సుబ్బారావు, ఎ.మన్మథరావు, ఐ.పవన్, ఎ.భాస్కరరావు, పి.నారాయుడు, బి.ఉమామహేశ్వరరావు, ఎం.రవికుమార్, శ్యాంబాబు, లక్ష్మీనారాయణ, అప్పన్న, సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.